ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
బుధవారం 10 సెప్టెంబరు 2025



- వ్యవసాయ యాంత్రీకరణలో మళ్లీ జాప్యం
- రైతులకు తప్పని ఎదురుచూపులు
- యూరియా సమస్య తీరాకే యాంత్రీకరణపై దృష్టి
- వచ్చే నెలలో పరికరాల పంపిణీ
- జిల్లాలో 1200 దరఖాస్తులు..

ఊరిస్తూ.. నిరాశపరుస్తూ



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

వ్యవసాయ యాంత్రీకరణ పథకం చాలా ఏళ్లుగా అటకెక్కింది. గత ప్రభుత్వ హయాంలో నిలిచిన వ్యవసాయ సబ్సిడీ పరికరాలపై ఆశలు కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం యాంత్రీకరణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రూపొందించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా పరికరాల పంపిణీపై షెడ్యూల్ ఖరారు చేసినా జాప్యం రైతులను ఊరిస్తూ నిరాశపరుస్తోంది. సెప్టెంబరు 17 తేదీలోగా పరికరాలు రైతులకు అందించాల్సి ఉంది. అయితే యూరియా కొరత ఏర్పడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అధికారులు సమస్య పరిష్కారంపై నిమగ్నం కావడంతో యాంత్రీకరణ పథకం జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. తాత్కాలికంగా యాంత్రీకరణ పథకం పనులను పక్కన పెట్టాలని ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. యూరియా సమస్య తీరాకే వ్యవసాయ పరికరాల పంపిణీపై దృష్టి పెట్టే అవకాశం ఉంది. అక్టోబరు మాసంలో మళ్లీ పథకంలో వచ్చిన దరఖాస్తులు పరిశీలించి రైతులకు పరికరాలు అందిస్తారని భావిస్తున్నారు.

● యాంత్రీకరణ పథకానికి 1200 దరఖాస్తులు

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1200 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. గతనెల ఆగస్టులో 5నుంచి 15తేదీ వరకు వ్యవసాయశాఖ అధికారులు దరఖాస్తులు తీసుకున్నారు. దీంతోపాటు గతంలో రైతులు చేసుకున్న దరఖాస్తులను సైతం పరిగణనలోకి తీసుకున్నారు. మండల వ్యవసాయ అధికారులు అన్ని దరఖాస్తులను ఉన్నతాధికారులకు పంపారు. ఆగస్టులోనే 16నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులను పరిశీలించాల్సి ఉంది. ఇదే సమయంలో రైతులకు యూరియా సమస్య మొదలు కావడంతో వ్యవసాయశాఖ పూర్తిగా అటువైపు దృష్టి పెట్టారు. దీంతో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిలిచిపోయినట్లు తెలుస్తోంది. రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను తిరస్కరిస్తే అందుకు కారణాలను కూడా తెలియజేయాల్సి ఉంటుంది. గతంలో వచ్చిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 21నుంచి 27వ తేదీ వరకు ఎంపికైన రైతుల నుంచి డీడీలు తీసుకొని అదే నెలలో 27నుంచి సెప్టెంబరు 5వ తేదీ వరకు యంత్రపరికరాలకు ఆర్డర్ ఇవ్వాల్సి ఉంది. ఈనెలలో 7తేదీ నుంచి 17తేదీలోగా లబ్ధిదారులుగా ఎంపికైన రైతులకు పరికరాలు పంపిణీ చేయాల్సి ఉండగా తాత్కాలికంగా వాయిదా పడినట్లు తెలుస్తోంది.

● జిల్లాకు 198 యూనిట్లు..రూ 58.84 లక్షలు

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అనుసరించే దిశగా వచ్చిన వ్యవసాయయాంత్రీకరణ పథకం ఎనిమిదేళ్ల తరువాత మళ్లీ రైతుల్లో ఆశలు కల్పించినా జాప్యం తప్పడం లేదు. గతంలో అమల్లో ఉన్న వ్యవసాయ యాంత్రీకరణ పథకం 2016-17 అప్పటిప్రభుత్వం నిలిపివేసింది. మళ్లీ ఈపథకాన్ని 2024-25 ఆర్థికసంవత్సరంలో అమలుచేసేందుకు అడుగులు వేసింది. కేంద్రనిధులు వెనక్కి వెళ్లకుండా వేగవంతంగా రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు, యంత్రాలు అందించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు 198 యూనిట్లకు రూ.58.84లక్షలు మంజూరు చేశారు. జిల్లాలో యాంత్రీకరణపై దరఖాస్తులు తీసుకున్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించే వ్యవసాయ యాంత్రీకరణలో....

- మిగతా 8లో

పేద విద్యార్థిని చదువుకు ప్రభుత్వ ఆర్థిక భరోసా

- రూలక్ష చెక్కును తల్లిదండ్రులకు అందించిన కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థిని చదువుకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. చదువు మధ్యలో ఆగిపోకుండా కళాశాలలో చెల్లించాల్సిన ఫీజు కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లికి చెందిన ఇమ్మడోజు అశ్రిత హైదరాబాద్‌లోని ప్రైవేటు కళాశాలలో బీటెక్ మూడోవ సంవత్సరం చదువుతోంది. కళాశాలలో ఫీజు చెల్లించేందుకు ఆర్థికసహాయం చేయాలని హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణిలో దరఖాస్తు అందించగా స్పందించిన ప్రభుత్వం తగిన సహాయం చేయాలని కలెక్టర్‌కు సూచించింది. మంగళవారం కలెక్టరేట్‌లో అశ్రిత తల్లిదండ్రులకు చెక్కును అందజేశారు.

ఇందిరమ్మ ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తుల చేసుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మధ్యమానేరు ప్రాజెక్టు ముంపు గ్రామాలైన కొదురుపాక, వరదవెల్లి, నీలోజిపల్లి గ్రామాల నిర్వాసితుల నుంచి ఇందిరమ్మ ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నామని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఒక ప్రకటనలో తెలిపారు. బోయినపల్లి మండలం కొదురుపాక, వరదవెల్లి, నీలోజి పల్లి గ్రామాల నిర్వాసితులు ఎవరైతే ఆర్‌అండ్‌ఆర్ పట్టా ధ్రువీకరణ పత్రం పొందిన వారు గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామసభలను నిర్వహించి దరఖాస్తులను స్వీకరిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సిరిసిల్ల క్రైం, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ మహేష్ బి గీతే అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 13న జరిగే లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలన్నారు. రాజీమార్గం రాజమార్గమని, చిన్నచిన్నకేసులతో కక్షలు పెంచుకొని సమయాన్ని డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. జుడిషియల్ డిపార్ట్‌మెంట్ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్స్ రాజీపడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారు రాజీపడేటట్లు అవగాహన కల్పించాలన్నారు.

కోడెల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

- 14వ తేదిన పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడి

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ గోశాలలోని కోడెల పంపిణీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఒక ప్రకటనలో వెల్లడించారు. రాజన్న గోశాలలోని కోడెలను కొంత కాలంగా రైతులకు పంచుతున్నామని, కోడెలు అవసరమున్న రైతులు సంబంధిత ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత పత్రాలతో ఈనెల 14వ తేది ఆదివారం తిప్పాపూర్ గోశాలకు ఉదయం 9గంటలకు రావాల్సి ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులు చేయడంతో జియో ట్యాగింగ్, వెబ్‌సైట్‌లో రైతుల వివరాలు నమోదవుతాయని తెలిపారు.

విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలి

- అదనపు కలెక్టర్ నగేష్



వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

ఇల్లంతకుంట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగడానికి ఉపాధ్యాయులు ప్రోత్సాహాన్ని అందివ్వాలని అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల, గాలిపెల్లి గ్రామంలోని బీసీ బాలుర వసతి గృహాలను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భావిభారత నిర్మాణంలో విద్యార్థులే కీలకం అని, వారిని సరైనమార్గంలో నడపాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. గాలిపెల్లి గ్రామంలోని వసతిగృహంలో భోజనాన్ని, వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత, సీనియర్ ఉపాధ్యాయులు మహేష్‌చంద్ర, రమణారెడ్డి, మధుసూదన్‌రావు, లత, సునిత, సరిత, ఫయాజ్ మహమ్మద్, సుజాతదేవి పాల్గొన్నారు.

సీఎం, విప్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



సీఎం, ప్రభుత్వ విప్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రుద్రంగి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో రూ.42 కోట్ల 57 లక్షల నిధులతో 133/32 కెవి నూతన సబ్ స్టేషన్ మంజూరు కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ రైతులతో కలిసి కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కేసిరెడ్డి నర్సారెడ్డి, గండి నారాయణ, తర్రె లింగం, పల్లి గంగాధర్, ఇప్ప మహేష్, పిడుగు లచ్చిరెడ్డి, గుగ్గిళ్ల వేంకటేశం ఎర్రం అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట శివారులోని 33 కేవీ ఫీడర్‌లో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో బుధవారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ ఏఈ పృథ్వీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంటు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ట్రాన్స్‘ఫార్మర్’ కష్టాలు.. బీటలు వారుతున్న పొలాలు..!

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామ శివారులోని విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌లో తరుచు సమస్య తలెత్తుతోంది. బోరు బావుల్లో పుష్కలంగా నీరు ఉన్నా.. కరెంటు సరఫరా లేకపోవడం వల్ల రైతులు సాగు చేసిన పంటలు బీటలు వారుతున్నాయి. సుమారు 10 మంది రైతులు సాగు చేసిన 30 ఎకరాలకు కరెంటు అందిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్‌లో నెలకొంటున్న సమస్య లోపంపై పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసి తమ పంట పొలాలు ఎండిపోకుండా చూడాలని మొరపెట్టుకున్న స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలోని పంటలు పగుళ్ల చూపాయాని పేర్కొంటున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో పంట పూర్తిగా ఎండిపోయి ఎందుకు పనిరాకుండాపోనుందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించి తమ పంటలను కాపాడాలని కోరుతున్నారు.

కొత్త బస్టాండ్‌కు వచ్చిన ఆర్టీసీ బస్సులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కొత్త బస్టాండ్ అభివృద్ధి కమిటీ పోరాటం ఫలించింది. మంగళవారం సిరిసిల్ల నుంచి హైదరాబాద్ వెళ్లే వేములవాడ డిపో బస్సులు జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌కు వచ్చాయి. వేములవాడ, సిద్దిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌కు రాకుండానే పాత బస్టాండ్ నుంచి గతంలో వెళ్లిపోతుండడంతో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. దీంతో డిపో మేనేజర్ ప్రకాష్‌రావుకు కమిటీ సభ్యులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఆ మేరకు ఆర్టీసీ బస్సులు కొత్త బస్టాండ్‌కు వచ్చాయి.

జిల్లా వ్యాప్తంగా సేవాపక్షం కార్యక్రమాలను నిర్వహించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డబోయిన గోపి

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ఈనెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీవరకు సేవాపక్షం కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి కోరారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం జిల్లా స్థాయిలో కార్యశాలను కన్వీనర్ సిరికొండ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గోపి మాట్లాడుతూ స్వచ్ఛభారత్, రక్తదాన శిబిరం, పేదలకు, దివ్యాంగులకు సహకరించడం వంటి సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెన్నమనేని వికాస్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లాడి రమేష్, ఎర్రం మహేష్, లింగంపల్లి శంకర్, పార్లమెంట్ కో-కన్వీనర్ అడెపు రవీందర్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు, మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కొక్కు దేవేందర్‌యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులు శీలం రాజు, బండ మల్లేశం, బర్కం వెంకటలక్ష్మీ, సిరిసిల్ల నియోజకవర్గ కన్వీనర్ కారెడ్ల మల్లారెడ్డి, సంతోష్‌బాబు, కార్తీక్‌రెడ్డి, మానుక కుమార్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన న్యాయవాదులు



హైకోర్టు జడ్జి జస్టిస్ తుకారాం జీకి రాజన్న ప్రసాదం అందజేస్తున్న న్యాయవాదులు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు భవన నిర్మాణం శంకుస్థాపనకు రావాలని హైకోర్టు న్యాయమూర్తులను సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఇందులో భాగంగా హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ తుకారాం జీ, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విజయసేనారెడ్డి, జస్టిస్ శ్రీనివాసరావు, జస్టిస్ వేణుగోపాల్, జస్టిస్ నగేశ్‌లను న్యాయవాదులు కలిసి వేములవాడ రాజరాజేశ్వరస్వామి చిత్రపటాన్ని, ప్రసాదం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి వెంకటి, ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్, ట్రెజరర్ వేముల నరేశ్, సీనియర్ న్యాయవాదులు చెక్కిళ్ల మహేష్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, సురేష్, రమాకాంత్‌రావు పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ముషం రమేష్



వేములవాడలో మాట్లాడుతున్న మూషం రమేష్

వేములవాడ టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇళ్ల లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముషం రమేష్ అన్నారు. వేములవాడ పట్టణంలని సీపీఎం పార్టీ కార్యలయంలో నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని, బీడీ కార్మికులందరికీ నాలుగు వేలు జీవన భృతిని పెంచాలని ఈనెల 11వ తేదిన చేపట్టిన చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తుందని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. చలో కలెక్టరేట్ కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు. ఈ సమావేశంలో ముక్తికాంతం అశోక్, మల్లారపు ప్రశాంత్, సూరం పద్మ, చిలుక బాబు, సంజన, శివ, సాయి తదితరులు ఉన్నారు.

ప్రజాకవి కాళోజీ సేవలు మరువలేనివి : కలెక్టర్



కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు



నివాళులు అర్పిస్తున్న ఎస్పీ మహేష్ బి. గీతే

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజాకవి కాళోజీ నారాయణ రావు సేవలు మరువలేనివని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. సిరిసిల్ల సమీకృత కలెక్టరేట్‌లో మంగళవారం కాళోజీనారాయణ రావు జయంతి వేడుకలను ఘనంగా చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీపీఆర్వో వంగరి శ్రీధర్, డీవైఎస్‌వో రాంధాస్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి లత, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల క్రైం : తెలుగు సాహిత్యానికి ప్రజాకవి కాళోజీ చేసిన సేవలు చిరస్మరణీయమని ఎస్పీ మహేష్ బీ గీతే అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ తెలుగు భాషా పరిరక్షణకు ప్రజల్లో ఉద్యమ చైతన్యం నింపిన మహనీయుడన్నారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్‌ఐలు మధుకర్, యాదగిరి, పాల్గొన్నారు.

ఆన్‌లైన్ కోచింగ్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా - ఎమ్మెల్యే సత్యంతో కలిసి ఆన్‌లైన్ తరగతుల ప్రారంభం



ఆన్‌లైన్ తరగతులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

బోయినపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ కోచింగ్ తరగతులను సద్వినియోగ పరుచుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఆన్ అకాడమీ ద్వారా ఆన్‌లైన్ తరగతులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే పిల్లలకు పోటీ పరీక్షల రాసేందుకు ఆన్‌లైన్ తరగతుల ద్వారా మంచి శిక్షణ ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆన్ లైన్ తరగతుల్లో దేశంలోని నిపుణులైన టీచర్లతో పిల్లలకు బోధన జరుగుతోందని, ఢిల్లీలో విద్యార్థులకు అందే శిక్షణ నేడు సాంకేతికతను వినియోగించుకుని సిరిసిల్ల జిల్లాలోని పిల్లలకు కూడా అందిస్తున్నామన్నారు. విద్యార్థి జీవితంలో 10,11,12వ తరగతులు 3సంవత్సరాలు చాలా కీలకమన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకుని వస్తే సత్వరమే పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. మాడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఫ్యాన్లు లేవని తెలుపగా వెంటనే 50 ఫ్యాన్లు మంజూరుచేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం విద్యా, వైద్యరంగాలకు పెద్దపీట వేస్తూ పేదల విద్యకు నిరంతరం కృషి చేస్తూ పెద్దఎత్తున నిధులు ఖర్చు చేస్తుందని అన్నారు. సిరిసిల్ల జిల్లాలో పిల్లలకు ఆన్‌లైన్ తరగతుల ద్వారా ప్రవేశ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందించేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపారన్నారు. మోడల్ స్కూల్లో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పూర్తిస్థాయిలో వినియోగించుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎమ్మెల్యే విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం రంగురంగుల బ్రోచర్‌లకే పరిమితమైంది..

- వేములవాడలోని 43 సంఘాలకు రూ.2.50 కోట్ల నిధులు.. - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రంగురంగు బ్రోచర్‌లకే పరిమితమైందని, అభివృద్ధి ఎక్కడ జరగలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం హంగుఆర్భాటాలకు పోకుండా క్షేత్రస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజల కళ్ళముందుంచుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని 9,10,11,12, వార్డుల్లో పలు కుల సంఘ భవనాల నిర్మాణానికి మంజూరైన ప్రొసీడింగ్ కాపీలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టణంలో పలు కుల సంఘాల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులు అందజేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు పట్టణంలో 43 కుల సంఘాలకు రూ. 2 కోట్ల 50లక్షల నిధులు మంజూరుచేసి ప్రొసీడింగ్‌లు అందజేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని సూచించారు. కుల సంఘాల్లో స్థానికులు సమావేశాలు, పండగలు చేసకునే అవకాశం ఉటుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పట్టణంలో ఇల్లు లేని పేదవారికి మొదటి సారిగా 400 పైచిలుకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని అన్నారు. వాటిలో సుమారు 300 ఇండ్లు బేస్మెంట్ లెవల్ దాటి నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే వేములవాడ దేవాలయ అభివృద్ధి, రోడ్డు వెడల్పు పనులు ప్రారంభం అయ్యాయని అన్నారు. గత ప్రభుత్వం మూలవాగుపై మూడవ బ్రిడ్జి లేకున్న ఉన్నట్లు చూపించారని విమర్శించారు. గత 52 యేళ్లుగా ఎదురు చూసిన రోడ్డు వెడల్పు పనులు ముందుకు సాగుతున్నాయని, పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. పట్టణంలోని జరిగే అభివృద్ధి పనులను చూసి మంచి చేసే వారికి మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రజలవద్దకే ప్రభుత్వం వస్తుందని, సమస్యలు ఉంటే నేరుగా తనవద్దకే రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రొండి రాజు, కనికరపు రాకేష్, బింగి మహేష్, సిరిగిరి శ్రీకాంత్, చిలుక రమేష్ తదితరులు ఉన్నారు.

నిరుపేద కుటుంబాలకు అండగా ప్రభుత్వం.. 7

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి.. 8

తల్లి మందలించిందని విద్యార్థిని ఆత్మహత్య


మధుమతి(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించిందని మనస్థాపం చెందిన పదో తరగతి విద్యార్థిని లకావత్ మధుమతి(16) ఈ నెల 1న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఎస్ఐ రాహుల్‌రెడ్డి, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వీర్నపల్లి మండలం రంగంపేటకు చెందిన లకావత్ లలిత-ఫరంగి దంపతులకు ఒక్కగానొక్క కూతురు మధుమతి. ఈ కుటుంబం ఐదేళ్ల క్రితం ఉపాధి కోసం ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికి వచ్చారు. కూతురు మధుమతి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. తరచూ బడికి వెళ్లకపోవడంతో ఈ నెల 1న తల్లి లలిత కూతురు మధుమతిని మందలించింది. మనస్థాపం చెందిన విద్యార్థిని ఇంటిలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. గమనించిన కుటుంబీకులు ఆమెను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వారం రోజుల పాటు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయింది. మృతురాలు తల్లి లలిత ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

సైదాపూర్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని దుద్దెనపల్లి గ్రామానికి చెందిన బోయిని సత్యనారాణ స్వామి(42) అనే వ్యక్తి అనారోగ్యం భరించలేక ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు సత్యనారాయణ స్వామి భార్య రేణుక, అతని పెద్ద కుమారుడు మణిసాయి వారం రోజుల క్రితం ఊరు వెళ్లారు. సత్యనారాణ స్వామి తన చిన్న కుమారుడు సాయితేజ ఇంట్లో ఉంటున్నారు. సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో సాయితేజ కిరాణ షాపునకు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో సత్యనారాణ స్వామి దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్నకుమారుడు సాయితేజ వచ్చి చూసేసరికి సత్యనారాణస్వామి దూలానికి వేలాడుతూ కనిపించాడు. తన తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్నాడని మృతుడి పెద్ద కుమారుడు మణిసాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

ఆరోగ్యం సహకరించడం లేదని ఆత్మహత్య



దేవయ్య(ఫైల్)

కోనరావుపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యం సహకరించడం లేదని ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుద్దాల గ్రామానికి చెందిన అలువాల దేవయ్య(57) చాకలి వృత్తితోపాటు బ్యాండ్ వాయించడం, డీజే నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో రెండుసార్లు యాక్సిడెంట్ కావడంతో కాలు విరిగింది. ఆరోగ్యం సహకరించకపోవడంతో జీవితం మీద విరక్తి చెంది సోమవారం రాత్రి పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఏడు గంటలకు వరకు కూడా రాకపోవడంతో ఆ ప్రాంతాన్ని కుటుంబ సభ్యులు రాత్రంతా వెతికారు. పొలం వద్ద ఉన్న ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఒక్క క్షణం..

ఆలోచిస్తే నిలుస్తుంది ప్రాణం

- మనోధైర్యం కోల్పోవద్దు..
- చావే సమస్యకు పరిష్కారం కాదు
- చిన్న వయస్సు నుంచే ఓటమిని తట్టుకోవడం నేర్పాలి
- నేడు ఆత్మహత్య నివారణ దినం



కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆత్మవిశ్వాసంతో, మనోధైర్యం కోల్పోకుండా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి పట్టుదలతో ప్రయత్నిస్తే సాధించలేనిది ఏదీ ఉండదు. చావే సమస్యకు పరిష్కారం కాదు... ఆధునిక కాలంతోపాటు పరుగులు తీస్తూ ప్రకృతిని శాసించే స్థాయిలో సాంకేతికంగా ఎంతో పురోమిస్తున్న సందర్భంలో ఎన్నో అవకాశాలు, వసతులు, సౌకర్యవంతమైన జీవన విధానాలు అందుబాటులోకి వచ్చాయి.

ఇదే సమయంలో ఆర్థికపరమైన ఇబ్బందులు, ఒత్తిడితో కూడిన చదువులు, ఉద్యోగాలు, ప్రేమ విఫలం, కుటుంబ కలహాలు వంటి కారణాలతో రోజు రోజుకు ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. చిన్నపాటి సమస్యలను కూడా తనకుతానుగా పరిష్కరించుకోలేని పరిస్థితుల్లో నేటి యువత ఉంది. మన పూర్వీకులు లక్షలు, కోట్ల రూపాయలు, ఆస్తులు లేకున్నా ఆనందమయ జీవితాలను గడిపారు. దీనికి ప్రధాన కారణం వారసత్వంగా వచ్చిన జీవననైపుణ్యాలతో వారిలో బతకగలుగుతామనే మనో ధైర్యం ఉండేది. కాని నేటి తరంలో అవి కొరవడుతున్నాయి. క్రమశిక్షణ కొరవడం, విచక్షణలేమి వంటివి మానసికంగా దెబ్బతీస్తున్నాయి. చిన్న వయస్సు నుంచే పిల్లలకు ఓటమి, ఒత్తిడిని తట్టుకునేలా తల్లిదండ్రులు నేర్పించాలి. చిన్న చిన్న సమస్యలు వచ్చిన సమయాల్లో వారే పరిష్కరించుకునేలా పరిస్థితులను కల్పించాలి.

సమస్య వచ్చినప్పుడు దిగులు చెందితే పరిష్కారం దొరకదు. సమస్య నుంచి బయట పడడానికి, కనీసం సమస్య తీవ్రతను తగ్గించుకోవడానికి ఆలోచించాలి. ఓటమిని పాఠంగా నేర్చుకుని విజయానికి అది మెట్టుగా సరిదిద్దుకోవాలి. ప్రతి వ్యక్తి జీవితంలో ఏదో ఒక విషయంలో సర్దుబాటు అనేది తప్పనిసరి. ప్రతిదీ మనం అనుకున్నట్లే జరగాలనుకుంటే సాధ్యమయ్యే పనికాదు.

ఉమ్మడి కుటుంబాలు మాయం..

నేటి ఆధునిక సమాజంలో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్నాయి. ఆత్మహత్యలకు ఇదీ ఒక కారణమని మానసిక, సామాజికవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఉమ్మడి కుటుంబాల్లో సమస్యలు వచ్చిన సందర్భంలో అందరు కుటుంబ సభ్యులు ఒక చోట కూర్చుండి సమస్యపై చర్చించుకుని, పరిష్కరించుకునేవారు. ఒకరి బాధను మరొకరు పంచుకునేవారు. నేటి సమాజంలో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవటంతో భార్యాభర్తల మధ్య విభేదాలు, భేదాభిప్రాయాలు తలెత్తిన సందర్భంలో వారికి సర్ది చెప్పి, వారి సంసారం సజావుగా సాగిపోయేలా నిర్ణయాలు తీసుకునే కుటుంబ పెద్దలు లేకుండా పోయారు. మరో వైపు భార్యభర్తలు ఇరువురు ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ ఇరువురు సంపాదిస్తుండటంతో సమానమనే భావనతో ఇగోలు పెరిగిపోవటంతో తరచుగా దంపతుల్లో విభేదాలు తలెత్తుతున్నాయి. ఇటువంటివి మొగ్గలోనే తుంచే పెద్ద మనిషి అందుబాటులో ఉండడం లేదు. మరో వైపు యువ దంపతులు వివాహం కాగానే ఉద్యోగరీత్యా, పిల్లల చదువురీత్యా, ఇతర త్రా పట్టణాలలో కాపురాలు పెడుతున్నారు. ఇటువంటి సమయాల్లో వారి మధ్య తలెత్తిన చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే కుటుంబ వ్యవస్థ లేకుండా పోయింది. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవటంతో కట్టుబాట్లు, ఆచరణ పద్ధతులు, సంప్రదాయాలు కొంత వరకు కనుమరుగవుతున్నాయి.

ఏడాదిన్నరలో 494 మంది ఆత్మహత్య

కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్‌లో గడిచిన ఏడాదిన్నర సమయంలో 494 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. కుటుంబ సమస్యలు, ఆర్థికపరమైన ఇబ్బందులు, భార్యభర్తల మధ్య తగువులు, మానసిక, ఆరోగ్య సమస్యలతో పురుగుల మందుతాగి, ఉరివేసుకుని, బావుల్లో, చెరువుల్లో దూకి బలవన్మరణాలకు పాల్పడ్డారు. 2024 సంవత్సరంలో 288 మంది, 2025 సంవత్సరం సెప్టెంబరు 9 వరకు 206 మంది ఆత్మహత్య చేసుకున్నారు.

నేపథ్యం

ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవాన్ని 2003లో అంతర్జాతీయ ఆత్మహత్య నివారణ సంఘం, ప్రపంచ ఆరోగ్య సంస్థతో కలిసి ఏర్పాటు చేసింది. ప్రతి ఏడాది సెప్టెంబరు 10వ తేదీన ఆత్మహత్యలపై దృష్టిని కేంద్రీకరించడం, కళం కాన్నితగ్గించడంపై దృష్టి పెట్టారు.



సమస్యకు చావే పరిష్కారం కాదు....

ఎ నిరంజన్‌రెడ్డి, కరీంనగర్ రూరల్ సీఐ



ఎంతటి సమస్యకైనా చావే పరిష్కారం కాదని గ్రహించాలి. ఏదైనా సమస్య వచ్చిన సందర్భంలో కుటుంబ సభ్యులు, సన్నిహితులతో చెప్పుకుంటే మనసులో ఉన్న బాధ కొంతవరకు తొలగిపోయి సమస్య పరిష్కారానికి మార్గం లభిస్తుంది. సమస్య ఎదురైనప్పుడు అధైర్యపడొద్దు. ఆ సమస్యలను ఏ విధంగా పరిష్కరించుకోవాలి, అధిగమించాలనేది కొద్ది సేపు ఆలోచిస్తే ఆత్మహత్య నిర్ణయం నుంచి బయటపడుతారు.

క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు జీవితంపై ప్రభావం

డాక్టర్ వర్ష, మానసిక వైద్య నిపుణుడు

క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు వారి జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. ఆత్మహత్యలకు పురిగొల్పుతాయి. ఇలాంటి నిర్ణయాలు జీవితాలను చిదిమేస్తాయి. జీవితంపై సరైన అవగాహన, ధృక్పథం లేకపోవడం వల్ల ఆత్మహత్య ఆలోచనలు మదిని తొలగిచివేస్తాయి. జీవితంలో తిరిగి పొందలేనివి రెండే. ఒకటి కాలం, మరొకటి ప్రాణం. వీటిని తిరిగిపొందలేమనే నిజాన్ని తెలుసుకోవాలి.



బస్సు ఆపలేదని డ్రైవర్‌పై దాడి

వేములవాడ టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఆపలేదని డ్రైవర్‌పై ఓ వ్యక్తి దాడికి దిగాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ నుంచి మర్రిమడ్ల వెళ్లే ఆర్టీసీ బస్సు పట్టణంలోని కోరుట్ల బస్టాండుకు వచ్చింది. దీంతో బస్సు ఎక్కేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించగా బస్సు ముందుకు కదలడంతో డ్రైవర్‌కు, సదరు వ్యక్తికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో డ్రైవర్‌పై అతను దాడి చేయడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు అతన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు తెలిపారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట,సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌పై వాట్సాప్ గ్రూప్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకుడు మహేందర్ ఆధ్వర్యంలోని నాయకులు మంగళవారం ఎల్లారెడ్డిపేట పోలీసుకు ఫిర్యాదు చేశారు. నాయకులు సంతోష్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, ఇలియాస్ ఉన్నారు.

ముగ్గురు వ్యక్తులపై కేసు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలోకి అక్రమంగా ప్రవేశించడంతో పాటు చదును చేసిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన గెంటె శ్రీనివాస్, గెంటె తిరుపతి, గెంటె లక్ష్మీలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్ రెడ్డి మంగళవారం రాత్రి పేర్కొన్నారు. తహసీల్దార్ సుజాత ఫిర్యాదు మేరకు ముగ్గరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మట్టి తరలిస్తున్న ఇద్దరిపై కేసు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్ఐ లక్ష్మణ్ మంగళవారం రాత్రి తెలిపారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు. వీర్నపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్, యజమానులపై కేసు నమోదు చేశామని చెప్పారు.

జమ్మికుంట మండలంలో..

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 09 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం పెద్దంపల్లి గ్రామానికి చెందిన కొత్త ఎల్లారెడ్డి భూమిలో గత నెల 15న అదే గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి, గణపతిరెడ్డిలు అక్రమంగా దున్నుతుండగా ఎల్లారెడ్డి అడ్డుపడ్డాడు. భూమిలోకి వస్తే చంపేస్తామని వారు బెదిరించారని వచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

అప్పుల బాధతో కండక్టర్ ఆత్మహత్య


లక్ష్మీనారాయణ(ఫైల్)

కథలాపూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండల కేంద్రానికి చెందిన పల్లికొండ లక్ష్మీ నారాయణ (54) అనే ఆర్టీసీ కండక్టర్ అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం లక్ష్మీనారాయణ కోరుట్ల డిపోలో కండక్టర్‌గా పనిచేస్తుండగా విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నాడనే అబియోగంతో ఏడాది క్రితం సస్పెండ్ చేశారు. దీంతో మద్యానికి బానిసై అప్పుల బారం పెరిగింది. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన లక్ష్మీనారాయణ గ్రామ శివారులోని మర్రిచెట్టుకు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

వివాహిత ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన వివాహిత ఈరవేణి రమ్య(35) ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు. భార్య మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆమె భర్త కృష్ణ దుబాయి నుంచి బయలుదేరాడు. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

లారీ డ్రైవర్ ఆత్మహత్య

తంగళ్లపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేటకు చెందిన వాడెపు జంగయ్య(45) మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న జంగయ్య మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడుతుండేవాడు. మంగళవారం తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ శివారులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉపేంద్ర చారి తెలిపారు.

ఇసుక రవాణా చేస్తున్న లారీ, టిప్పర్ పట్టివేత

తంగళ్లపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీతో పాటు టిప్పరును పట్టుకున్నట్లు ఎస్ఐ ఉపేంద్ర చారి తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున తంగళ్లపల్లి గ్రామ శివారులో పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీ, టిప్పర్లు పట్టుబడ్డాయి. లారీ, టిప్పర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లారీ, టిప్పర్ల డ్రైవర్లతో పాటు యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం మత్తులో విధులకు..

● ఫోన్‌లో అశ్లీల వీడియోలు ● ఆసుపత్రిలో లైంగిక దాడి నిందితుడి అరెస్టు

ఎప్పుడూ మద్యం సేవించి ఆస్పత్రికి వచ్చేవాడు. తాగనిదే డ్యూటీలోకి వెళ్లడు.. అతని వ్యవహార శైలిని గమనించిన రెండు ఆస్పత్రులు ఉద్యోగం నుంచి తప్పించాయి.. కొన్నాళ్లు స్వగ్రామానికి వెళ్లిన అతడు తిరిగి వచ్చి మళ్లీ ఓ ఆస్పత్రిలో చేరాడు. ఈ నెల 6న మద్యం సేవించి ఆసుపత్రికి వచ్చాడు. ఎమర్జెన్సీలో డ్యూటీ వేయించుకుని 7న తెల్లవారు జామున ఓ యువతికి మత్తు మందు ఇచ్చి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసు కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో జ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న యువతిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని కరీంనగర్ త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కమిషనరేట్ కేంద్రంలో పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జ్వరంతో బాధపడుతున్న యువతిని ఆమె తల్లిదండ్రులు ఈ నెల 6న కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అదే ఆసుపత్రిలో కాంపౌండర్/ఓటీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న మహారాష్ట్రకు చెందిన పెద్ది దక్షన్‌మూర్తి అలియాస్ దక్షిణామూర్తి (23) ఆసుపత్రిలో రాత్రి విధుల్లో ఉన్నాడు. 7న వేకువజామున బాధితురాలికి మత్తుమందు ఇంజక్షన్ ఇచ్చి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధిత యువతికి మెలకువ వచ్చిన అనంతరం జరిగిన విషయాన్ని తన తండ్రికి చెప్పడంతో, అతను కరీంనగర్ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు క్రైమ్ నంబర్ 343/2025 అండర్ సెక్షన్ 64(2)(ఇ) బీఎన్ఎస్-2023 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు ఆసుపత్రికి వెళ్లి సాక్షులను విచారించారు. ఆధారాలను సేకరించారు. ఆధారాలన్నీ పరిశీలించిన తరువాత, సెప్టెంబర్ 8న పోలీసులు నిందితుడు పెద్ది దక్షన్‌మూర్తి అలియాస్ దక్షిణామూర్తిని అరెస్ట్ చేశారు.

● నిందితుడి నేపథ్యం...

మహారాష్ట్రలోని గడ్చిరౌలి జిల్లా, సిరొంచ తాలూకా, లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందినపెద్ది దక్షన్‌మూర్తి అలియాస్ దక్షిణామూర్తి ఇంటర్ వరకు చదువుకుని, నాలుగు సంవత్సరాల క్రితం కరీంనగర్ వచ్చాడు. ప్రస్తుతం ఆదర్శనగర్‌లో నివాసం ఉంటున్నాడు. మొదట కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో వార్డు బాయ్‌గా పని చేసి, మరో ఆసుపత్రిలో మేల్ నర్సుగా చేరాడు. తరచూ మద్యం సేవించి డ్యూటీకి రావడం వల్ల ఆసుపత్రి యాజమాన్యం అతడిని ఉద్యోగం నుంచి తొలగించింది. అనంతరం స్వగ్రామానికి వెళ్లి తిరిగి కరీంనగర్ వచ్చి ఈ ఆసుపత్రిలో మేల్ కాంపౌండర్‌గా చేరాడు. నిందితుడు తరచూ అశ్లీల వీడియోలు చూస్తూ, మద్యం సేవించి విధులకు హాజరయ్యేవాడు అని సీపీ తెలిపారు. లైంగికదాడి జరిగిన రోజు మద్యం సేవించి ఆసుపత్రి విధులకు హాజరైన నిందితుడు దక్షన్‌మూర్తి వేకువజామున యువతికి మత్తు మందు ఇంజక్షన్ ఇచ్చి లైంగిక దాడికి పాల్పడిన సాక్ష్యాలను సీసీ కెమెరాద్వారా పోలీసులు సేకరించారు. మద్యం కొనుగోలు చేయటం, ఫోన్ పే ద్వారా డబ్బులు పంపించిన ఫోన్‌ను, మద్యం దుకాణం వద్ద సీసీ పుటేజీలతో పాటు మత్తుమందు ఇచ్చిన ఇంజక్షన్, బెడ్‌షీట్, ఇతర అన్ని సాక్ష్యాధారాలను పోలీసులు సేకరించారు. నిందితుడి ఫోన్‌లో పోర్న్ వీడియోలను గుర్తించారు.

● ఆసుపత్రులు భద్రత కల్పించాలి

దర్యాప్తులో ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యం వహించినట్లు తేలితే కలెక్టర్, సంబంధిత అధికారులకు నివేదిక పంపి తగు చర్యలు తీసుకుంటామని పోలీస్‌కమిషనర్ తెలిపారు. కరీంనగర్‌లో 450 వరకు ప్రైవేట్ ఆసుపత్రులున్నాయని, ప్రజలు నమ్మకంతో ఆసుపత్రుకలు వస్తుంటారని, వీరికి భద్రత కల్పించటం ఆసుపత్రి నిర్వాహకుల బాధ్యత అని అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అన్నిరకాల భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఆసుపత్రుల్లో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది పూర్తి వివరాలు, వారి ప్రవర్తన గురించి తెలుసుకోవాలని సూచించారు. ఈ విషయంపై త్వరలోనే కలెక్టర్ అనుమతితో కో ఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు.

● యువత వ్యసనాలకు బానిస కావొద్దు

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, వాటికి బానిసలు కావద్దని సీపీ సూచించారు. ఈ కేసులో నిందితుడు చెడు అలవాట్లకు బానిసై, పోర్న్ వీడియోలు చూస్తూ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడన్నారు. తన జీవితాన్ని నాశనం చేసుకోవడమే కాకుండా, ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడ్డాడని తెలిపారు. యువత కెరీర్‌పై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, మూడో టాణా సీఐ జాన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

కారు - ఆర్టీసీ బస్సు ఢీ : ఒకరి పరిస్థితి విషమం


ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు

ధర్మారం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ధర్మారం మండల కేంద్రంలో మంగళవారం కారు, ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన దూపం శివప్రసాద్ (28) కారులో పెద్దపల్లికి వెళ్తున్నాడు. ధర్మారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలోని బ్రిడ్జి వద్దకు రాగానే ముందుగా వెళ్తున్న ఆటోను తప్పించే క్రమంలో కరీంనగర్ నుండి మంచిర్యాలకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును కారుఢీకొట్టడంతో శివప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కారు బెలూన్స్ ఓపెన్ కావడంతో ప్రమాదతీవ్రత తగ్గింది. కారులో ఉన్న క్షతగాత్రుడిని స్థానికులు కారు అద్దాలు పగులగొట్టి బయటకు తీశారు. క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో హుటాహుటిన కరీంనగర్‌లోని అపోలో హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. యాక్సిడెంట్‌తో కారు అద్దాలు, ఆటోలోని కూల్‌డ్రింక్స్‌తో రోడ్డంతా చిందరవందరగా మారింది. ఒక్క సారిగా ఏం జరిగిందో తెలియక ప్రజలు ఆందోళనకు గురయ్యారు. యాక్సిడెంట్ వల్ల బస్సు - కారు రోడ్డుకు అడ్డంగా ఉండడంతో అరగంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగింది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఆదేశంతో హెడ్ కానిస్టేబుల్ భూమయ్య, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఎక్స్‌కావేటర్ సాయంతో కారును పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

అసైన్డ్ భూమి కోసం ఇరువర్గాల ఆందోళన

ముస్తాబాద్, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావ్‌పల్లె గ్రామంలో గ్రామస్థులకు, ఓ వర్గానికి మధ్య ఏళ్ల తరబడి ఘర్షణ జరుగుతోంది. గ్రామ పరిధిలోని అసైన్డ్ భూమిని ఓ వర్గానికి చెందిన కొంత మందికి ముప్పై యేళ్ల క్రితం ఓ సర్వేనెంబరులో పట్టాలు అందించి హద్దులు చూపడం మరిచారు. ఈనేపథ్యంలో దాదాపు 80 ఎకరాలు అసైన్డ్ భూమిలో ఓ వర్గం సాగు చేస్తుండగా అది ఊరదంరికీ ఉపయోగపడే స్థలమని అందులో ఐకేపి సెంటర్ నిర్వహిస్తున్నామని మరో చోట సాగు చేసుకోవాలని గ్రామస్థులు సూచించారు. అయినా అందులో పంటసాగు చేయడంతో గ్రామస్థులు ట్రాక్టర్లతో పంటను తొలగించే యత్నం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామస్థులు స్థలాన్ని గ్రామానికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ ప్రధాన రహదారిపై బైఠాయించారు. సిద్దిపేట-కామారెడ్డి ప్రధాన రహదారిని స్తంభింపజేశారు. ఆందోళన జరుగకుండా కలెక్టర్ సందీప్ కుమార్ ఆదేశాల మేరకు బిఎన్.ఎస్.సెక్షన్ 163(144 సెక్షన్) వర్తింపజేయాలని ఆదేశాలు జారీ చేశారు. గతంలో తలెత్తుతున్న సమస్య పరిష్కారం కాకపోవడంతో తహసీల్దార్‌ను హుటాహుటిన కలెక్టరేట్ కార్యాలయానికి బదిలీ చేశారు. తహసీల్దార్‌గా రాంచంద్రంకు బాధ్యతలను అప్పగించారు. శాంతిభద్రతల రక్షణకు సీఐ మొగిలి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య


గోపగోని బాబు(ఫైల్)

తిమ్మాపూర్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ నుంచి ట్రాక్టర్ లోన్, ఇంటి లోన్‌లు తీసుకొని కట్టలేదని ఫైనాన్స్ వారి వేధింపులతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన తిమ్మాపూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. తిమ్మాపూర్‌కు చెందిన గోపగోని బాబు(43) గ్రామంలో వ్యవసాయ భూమి కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటున్నాడు. ఇతడికి భార్య పద్మ, ఇద్దరు కుతూళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. బాబు వ్యవసాయ పనుల నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఫైనాన్స్‌లో 2.80 లక్షల రూపాయలతో ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాడు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఫైనాన్స్ కంపెనీకి రెండు వాయిదాలు చెల్లించలేదు. దీంతో కంపెనీ ప్రతినిధులు ఫోన్‌లో బెదిరించడంతో పాటు వాయిదాలు చెల్లించకపోవడంతో ట్రాక్టర్‌ను కూడా తీసుకెళ్లారు. ఆదే విధంగా ఇంటిని మార్టిగేజ్ చేసి 7లక్షల 70వేల రూపాయల హోమ్ లోన్ బాబు తీసుకున్నాడు. ఇంటికి తీసుకున్న లోన్ ఒక వాయిదా కూడా చెల్లించకపోవడంతో పాటు బాబు వేరే అప్పులు కూడా చేసి ఆర్థికంగా ఇబ్బందిపడ్డాడు. ఒక నెల సమయం ఇస్తే రెండు ఫైనాన్స్‌లకు సంబంధించిన బాకాయిలను చెల్లిస్తానని హామీ ఇచ్చిన బాబు ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపానికి గురై ఈ నెల 6వ తేదీన పొలం వద్దకు వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి కొద్ది సేపటికి గడ్డి మందు తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు బాబును కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాబు మంగళవారం ఉదయం మృతి చెందాడు. బాబు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

లారీని ఢీకొట్టిన గూడ్స్ వాహనం

● పేలిన ఆక్సిజన్ సిలిండర్లు ● ముగ్గురికి గాయాలు


దగ్ధమవుతున్న వాహనం


క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది

బచ్చన్నపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారిపై ఆలీంపూర్- వీఎస్ఆర్ నగర్ టోల్‌గేట్ మధ్య ఆగివున్న లారీని, అశోక లేలాండ్ గూడ్స్ వాహనం ఢీకొని దగ్ధమైంది. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరుకు చెందిన బొమ్మడవేణి శ్రీనివాస్, కొత్తూరు శ్రీను, తిప్పట్ల శ్రీనివాసులు రాజమండ్రి నుంచి చేప పిలల్లను సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామ చెరువులో వేసేందుకు తీసుకొస్తున్నారు. చేప పిల్లల రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న ఆక్సిజన్ సిలిండర్‌లు పేలడంతో మంటలు వ్యాపించి గూడ్స్ వాహనం దగ్ధమైంది. ప్రమాదం జరగగానే రైతులు వాహనంలో ఇరుక్కున్న ముగ్గురిని బయటకు తీశారు. దీంతో ప్రాణాపాయం తప్పింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ అబ్దుల్ హమీద్ ఘటనాస్థలికి చేరుకుని, క్షతగాత్రులను జనగామ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో రూ. 9.50 లక్షల వాహనం దగ్ధం కాగా, రూ. 1.50 లక్షల చేపపిల్లలు చనిపోయాయని తెలిపారు. బొమ్మడవేణి శ్రీనివాస్ బావమరిది పెసరు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

పెళ్లి కుదరడం లేదని ఇటీవల ఆత్మహత్యాయత్నం



మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెళ్లి సంబంధాలు కుదరడం లేదనే మనస్థాపంలో కొద్దిరోజుల క్రితం పురుగుల మందు తాగిన జిన్నా శ్రావణి(22) అనే యువతి మంగళవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మెట్‌పల్లి మండలం కొండ్రికర్ల గ్రామానికి చెందిన జిన్నా అం తయ్యకు ఇద్దరు కుమారులతో పాటు కూ తురు జిన్నా శ్రావణి ఉన్నారు. శ్రావణికి పెళ్లి సంబంధాలు కుదరడం లేదని ఈనెల 5న పురుగుల మందు తాగింది. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందు తున్న జిన్నా శ్రావణి మంగళవారం మృతి చెందిందని గ్రామస్థులు తెలిపారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన సంభ మల్లేష్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన కాసనబాద కవిత అనే మహిళను చంపుతానని బెదిరించినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఇరు కుటుంబాలకు కొన్ని రోజులుగా గొడవలు జరుగుతు న్నట్లు ఎస్సై తెలిపారు. ఈ క్రమంలోనే మంగళవారం కవిత ఇంటి ముందుకు మల్లేష్ వచ్చి నానా బూతులు తిడుతూ కత్తి పట్టుకొని చంపుతానని బెది రింపులకు పాల్పడ్డట్లు తెలిపారు. బాధితురాలు కవిత ఫిర్యాదు మేరకు మల్లేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల రూరల్ ఎస్సై తెలిపారు.

రోడ్డుప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల రూరల్ మండ లం తాటిపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గంగారాం (56) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. గంగారాం వ్యవసాయ పనులు ముగించుకొని సైకిల్‌పై తిరిగి తన స్వగ్రామం తాటిప ల్లికి వస్తున్న క్రమంలో ద్విచక్ర వాహ నంపై వస్తున్న జగిత్యాలకు చెందిన మహేష్ అనే వ్యక్తి ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలైన గంగారాంను జగిత్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గంగారాం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

దిద్దుబాటు చర్యలేవి..?

- కొండగట్టు ప్రమాదానికి రేపటితో ఏడేళ్లు
- బస్సు లోయలో పడి 67 మంది మృతి
- ప్రతిపాదనలకే పరిమితమైన నూతన ఘాట్‌రోడ్డు





కొండగట్టు లోయలో పడిన బస్సు(ఫైల్)

మల్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం కొండగట్టులో 2018లో బస్సు బోల్తా పడి ఘోర ప్రమాదం జరిగినా ఇప్పటికీ ఘాట్‌రోడ్డు దగ్గర అధికారులు ఎలాంటి దిద్దుబాటు చర్యలు చేపట్టలేదు. ఘాట్‌రోడ్డు అలైన్‌మెంట్ సరిగా లేదని నిపుణులు పదిహేను ఏళ్లగా సూచిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో 2018 సెప్టెంబరు 11న కొండగట్టు గుట్టపై నుంచి ఆర్టీసీ బస్సు దిగుతుండగా లోయలో పడి 67 మంది ప్రాణాలు కోల్పోగా 45మందికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం అనంతరం కొన్నాళ్ల పాటు ఘాట్ రోడ్డును మూసి వేసి వాహనాల రాకపోకలను నిషేధించారు. ఘాట్‌రోడ్డుకు కొంతమేర మరమ్మతులు, కొన్ని చోట్ల రక్షణ గోడల నిర్మాణం,



కొండగట్టు ఘాట్‌రోడ్డు

స్పీడ్‌బ్రేకర్ల మరమ్మతులు మాత్రమే చేపట్టారు. కానీ శాశ్వతంగా ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలు శూన్యం. గతంలోనూ ఈ ఘాట్ రోడ్డుపై జరిగిన వివిధ ప్రమాదాల్లో ఇప్పటి వరకు 150మందికి పైగానే భక్తులు మృతిచెందారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలను, క్షతగ్రాతులను ప్రత్యేక ప్యాకేజీ ద్వారా ఆదుకోవాల్సి ఉండగా సాయం కోసం నేటికీ బాధితులు ఎదురుచూస్తూనే ఉన్నారు.

ఘాట్‌రోడ్డు మరమ్మతులకే పరిమితం

గతంలో జరిగిన ప్రమాదాలు దృష్ట్యా కొన్నేళ్ల క్రితం మరో ఘాట్‌రోడ్డు కోసం ఆర్‌అండ్‌బీ అధికారులు ఓ కన్సల్టెన్సీ సంస్థతో సర్వే చేసి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం ఘాట్ రోడ్డు 1.2 కి.మీ. ఉండగా నిబంధనల మేరకు మలుపులతో కూడుకొని 2.5 కిమీ. ఉంటేనే రాకపోకలకు అనుకూలమని ఇంజనీరింగ్ అధికారులు తెలపడంతో కొత్త రోడ్డుకు 3.6 కి.మీల మేర సర్వే చేశారు.

అయితే ఘాట్‌రోడ్డు మాత్రమే కాకుండా అదనంగా దొంగల మర్రి నుంచి జేఎన్టీయూ మీదుగా కొండపైకి భక్తులు చేరుకోవడానికి ఘాట్‌రోడ్డు వైజంక్షన్ వరకు 9కి.మీ నాలుగులైన్ల రహదారి ఏర్పాటుకు ప్రతిపాదించారు. ప్రమాదాల నివారణకు, తీసుకోవల్సిన చర్యలపై ఈఈ(ఆర్‌అండ్‌బీ), జిల్లా రవాణా అధికారి, డీఎస్పీలతో ఏర్పాటు చేసిన త్రీమెన్ కమిటీ సూచనల మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. ఈ ప్రతిపాదనలూ అటకెక్కాయి.

రాణా ముందే ఆర్టీసీ బస్సు..

ఘాట్‌రోడ్డుపై జరిగిన ప్రమాదంలో 67మంది మృతికి కారణమైన ఆర్టీసీ బస్సు మల్యాల పోలీస్‌స్టేషన్ ముందు అలాగే ఉంది. ప్రమాదం జరిగాక స్టేషన్‌కు తీసుకురాగా ఇప్పటికీ అలాగే ఉండగా నాటి ప్రమాదానికి సాక్ష్యంగా నిలుస్తోంది. బస్సు పూర్తిగా తుప్పు పట్టిపోయింది. పైగా ఇది వ్యవసాయ భూములకు వెళ్లే మార్గంలో ఉండడంతో బస్సును అక్కడి నుంచి తొలగించాలని స్థానికులు, రైతులు పోలీసులను కోరుతున్నారు.



క్షతగాత్రులను పైకి తీసుకువస్తున్న స్థానికులు(ఫైల్)

శ్రీరాంసాగర్‌కు కొనసాగిన వరద

8 గేట్లు పైకి ఎత్తి 25 వేల క్యూసెక్కులు దిగువకు

జగిత్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీరు వదలడం మంగళవారం కొనసాగింది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 54,545 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా 8 గేట్లు పైకి ఎత్తి 25వేల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద కాలువకు 19,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 5,500 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కులు, అలీ సాగర్ ఎత్తిపోతల పథకానికి 360 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 684 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వర జలాశయనికి (మిడ్ మానేరు) ప్రాజెక్టు మంగళవారం 13400 ఇన్‌ఫ్లో కోసాగుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 13400, మానేరు ములవాగు ద్వారా 200 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతుంది. కాగా దిగివ ఉన్న ఎల్ఎండీ ప్రాజెక్టుకు నాలుగు గేట్ల ద్వారా 6 వేల క్యూసెక్కులు ప్యాకేజి 10 లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400, ప్యాకేజి 9లోని మల్కాపేట రిజర్వాయర్‌కు 900 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.75 ఉండగా, నిలువ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 26.914 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండుపంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.19 టీఎంసీల నీరు ఉంది. మధ్య మానేరు ద్వారా వస్తున్న 6400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 6600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధి

ఆగమ శాస్త్రం ప్రకారం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- పనుల పురోగతిపై సమీక్షా సమావేశం

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయాన్ని ఆగమ శాస్త్రం ప్రకారం అభివృద్ధి చేస్తున్నామని ప్రభు త్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న ఆలయ సమావేశ మందిరంలో ఆలయ అభివృద్ధి, విస్తరణ పనుల పురోగతిపై మంగళవారం కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా, ఈవో రమాదేవితో కలిసి సమీక్షా సమా వేశం నిర్వహించిన అనంతరం దేవాదాయ ప్రిన్సపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీని వాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు శీఘ్రదర్శనం, ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించేలా ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. రాజన్న ఆలయ విస్తరణ పనులను జూన్ 15వ తేదీన ప్రారంభం చేస్తామని గతంలో తెలి పినట్లుగానే యాదృచ్ఛికం గా అదేరోజు రాజన్న ఆజ్ఞతో పనులు ప్రారంభమయ్యా యన్నారు. శృంగేరి పీఠాధి పతుల సూచనలతో రాజన్న ఆలయాన్ని విస్తరణ చేపడుతున్నామని తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధికి టెండర్లు పిలిచామని, వీటిలో ఆలయ విస్తరణకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి విడత కింద రూ.76 కోట్లు పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. రాజన్న ఆలయంలో శ్రీస్వామివారికి కైంకర్య సేవలు, ఏకాంత, ఇతర సేవలు యథావిధిగా నిరంత రాయంగా కొనసాగుతాయని తెలిపారు. ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు జరిగే సమయంలో భీమేశ్వర ఆలయంలో భక్తులకు దర్శనం ఉండేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. భీమేశ్వర ఆలయంలో ఇప్పటికే షెడ్స్ పనులు చివరి దశలో ఉన్నాయని, ఫ్లోరింగ్ పనులు త్వరలోనే ప్రారం భం చేసి పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజన్న ఆలయ ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఈవో రమాదేవి, ఆలయ ఉద్యోగులు

విప్‌ను సన్మానించిన ఈవో రమాదేవి..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆల యానికి నూతనంగా సబ్‌స్టేషన్ మంజూరు చేసినం దుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను ఆలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఈవో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు శ్రావణ్‌కుమార్, గోవిందుల అశోక్‌కుమార్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, జయకుమారితో పాటు సూపరింటెండెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లో అక్రమ నిర్మాణాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. సర్వే నంబరు 459లో అక్ర మ నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామానికి చెందిన సోమ మునీంద్ర ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, పంచాయతీ అధికారి లక్ష్మయ్య, సిబ్బంది అక్రమ నిర్మాణాలను తొలగించేందకు ప్రయత్నించగా ఒడ్డెర కులస్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు అడ్డుకు న్నారు. పోలీసులు అక్కడకి చేరుకొని ఆందోళనకారులను చెదరగొట్టారు. అక్రమ నిర్మాణాల తొలగింపు, అడ్డుకున్న వారిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు.

ఆర్టీసీ పంచారామాల టూర్

భగత్‌నగర్, సెప్టెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): కరీంనగర్-2 డిపో నుంచి పంచారా మాల దర్శనాల కోసం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు నడిపిస్తున్నట్లు మేనేజర్ ఎం. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 12వ తేదీ శుక్రవారం కరీంనగర్ బస్టాండ్ నుంచి రాత్రి 10 గంటలకు బస్సు బయల్దేరుతుందని పంచరామాలు అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట స్థలాల సందర్శన ఉంటాయని వివరించారు. 15వ తేదీ సోమవారం కరీంనగర్‌కు చేరుకోనున్నట్లు తెలిపారు. ఈ టూర్ కోసం పెద్దలకు రూ.3300, పిల్లలకు రూ. 2500 టికెట్ ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సర్వీస్ నంబరు 88265తో ఆన్‌లైన్ రిజర్వేషన్ చేయించుకోవాలని, వివరాలకు 9398658062, 73382850708 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మల్కాపేట రిజర్వాయర్‌లోకి నీటి విడుదల

- రెండు పంపులు ఆన్ చేసి నీటిని విడుదల చేసిన అధికారులు
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషిపై హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



నీటిని విడుదల చేసిన అధికారులు

కోనరావుపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కోనరావుపేట మండలం మల్కాపేట గ్రామంలోని మల్కాపేట రిజర్వాయర్‌లోకి మిడ్ మానేరు నుంచి సుమారు 1.5 టీఎంసీ నీటిని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో అధికారులు మంగళవారం విడుదల చేశారు. దీంతో కోనరావుపేట మండలంలోని వ్యవసాయానికి సాగునీరు అందించవచ్చని అధికారులు తెలుపుతున్నారు. ఖరీఫ్ సీజన్‌తో పాటు రబీ సీజన్‌కు నీరు అందుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా మూడు టీఎంసీల సామర్థ్యం గల మల్కాపేట రిజర్వాయర్‌కు పూర్తి సామర్థ్యం వరకు నింపాలని ప్రజలు కోరుతున్నారు. ఏదైనా నీటిని విడుదల చేయడం పట్ల మండల రైతులు హర్షం వ్యక్తం చేయడమే కాకుండా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

జాతీయ స్థాయి శిక్షణ సదస్సుకు వెన్నంమట్ల ఉపాధ్యాయుడు



తిరుపతి

గొల్లపల్లి, సెప్టెంరు 9 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం వెన్గుమట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న తిరుపతి జాతీయ స్థాయి విద్యా సదస్సుకు ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆయన సీసీఆర్టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్సెస్ అండ్ ట్రైనింగ్) మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, న్యూ ఢిల్లీ వారి ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఈపీ 2020) ఓరియేంటేషన్‌కు హాజర య్యారు. ఈ నెల 8 నుంచి 27 వరకు 21 రోజుల పాటు హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పది మంది నిష్ణాతులైన ఉపాధ్యాయులను ఈ సదస్సుకు ఎంపిక చేయగా జగిత్యాల జిల్లా నుంచి తిరుపతి ఎంపికయ్యారు. గత 2021 సంవత్సరంలో ఒకసారి జాతీయ స్థాయి సదస్సులో పాల్గొన్న తిరు పతి మరోసారి అరుదైన ఘనత సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యా యులు, తోటి ఉపాధ్యాయులు తిరుపతిని అభినందించారు.

శాతవాహనలో లంబాడీ విద్యార్థుల ఆత్మగౌరవ ధర్నా

గణేశ్‌నగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలనే కుట్రను మానుకోవాలని శాతవాహన యూనివర్సిటీ లంబాడీ విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం విద్యాలయం గేటు ఎదుట ఆత్మగౌరవ ధర్నాను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్టీ జాబితా నుంచి బంజారా లంబాడీ, సుగాలీలను తొలగించాలని సుప్రీం కోర్టులో వేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం ఉప అధ్యక్షుడు భీమసాహెబ్, సంతోష్ నాయక్, ప్రేమ్‌నాయక్, రాహుల్, వంశీశంకర్, అరుణ్, మోహన్, శాతవాహన పరిశోధక విద్యార్థి బాదావత్ రంజీత్ నాయక్ పాల్గొన్నారు.



ఎస్‌యూ గేటు ఎదుట ధర్నా చేస్తున్న లంబాడి విద్యార్థులు

నిరుపేద కుటుంబాలకు అండగా ప్రభుత్వం

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



గేదెలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యం, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

బోయినపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామంలో ఏర్పా టు చేసిన మినీ డెయిరీ(పైలెట్ ప్రాజెక్టు) కింద పాడి గేదెల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ సందీప్ కుమార్‌తో కలిసి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులం సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్ ద్వారా 19 మంది లబ్ధిదారులకు 38 గేదెలను పంపిణీ చేశామన్నారు. గేదెలు అవసరం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. చొప్పదండి ఎమ్మె ల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమాజంలో అత్యంత వెనుక బడిన దళితులను ఆదుకోవడానికి మంచి విద్య అందించడంతో పాటు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు అందించేందుకు కృషి చేస్తుందన్నారు. పేద వర్గాలు చదువుకునే గురుకులాల్లో పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించేందుకు 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మెటిక్ చార్జిలను ప్రభుత్వం పెంచిందని అన్నారు.

గతం కంటే రెట్టింపుగా విదేశీ విద్యకు రేవంత్ సర్కార్ నిధులు విడుదల చేస్తోందని, గత సంవత్సరం 500 మంది వరకు దళిత వర్గాల బిడ్డలకు విదేశాలలో చదువుకునేందుకు 20 లక్షలు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం ద్వారా దళిత వర్గాల విద్యార్థులకు మెరుగైన వస్తువులు కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో మానవతా దృక్పథంతో ఆలోచిస్తూ క్షేత్రస్థాయిలో పనిచేసే కలెక్టర్ ఉండటం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని, ప్రజలకు సేవలు అందిస్తున్న కలెక్టర్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. యూరియా సమస్యను చాకచక్యంగా పరిష్కరించడంలో కలెక్టర్ కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు.

బోయినపల్లిలో దరఖాస్తు పెట్టుకున్న ప్రతి ఒక్కరికి పాడి గేదెలు అందేలా చర్యలు తీసుకుం టామని ఎమ్మెల్యే తెలిపారు. ముందుగా 40మంది లబ్ధి దారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అనం తరం కొదురుపాకలోని పశు వైద్యశాల ఉప కేంద్రాన్ని పరిశీలించి అవసరమైన మరమ్మతులకు ఆదేశించారు. అంతకు ముందు కాళోజి జయంతి సందర్భంగా చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి రవీందర్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బోయినిపల్లి ఎల్లేశ్ యాదవ్, వైస్‌చైర్మన్ నిమ్మ వినోద్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ జోగినపల్లి వెంకటరామారావు, మండల అధ్యక్షుడు వెన్నెల రమణరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, జంగంఅంజయ్య పాల్గొన్నారు.

వరదలకు కొట్టుకుపోయిన బ్రిడ్జి..


అంజన్న ఆలయానికి వెళ్లేందుకు భక్తుల కష్టాలు



ఆలయానికి వెళ్లేందుకు వాగు దాటుతున్న భక్తులు

గంభీరావుపేట మండలం బీముని మల్లారెడ్డిపేట ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే దారిలోని బ్రిడ్జి ఇటీవల వరదలకు కొట్టుకు పోయింది. దీంతో అంజన్న ఆలయానికి వెళ్లే భక్తులు మొకాళ్ల లోతు నీళ్లలో వాగులోంచి వెళుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగువ మానేరు మత్తడి దూకడంతో లింగన్నపేట వాగు ఉప్పొంగి ఉధృతంగా ప్రవహించింది. వరద ఉధృతితో అంజన్న ఆలయం వద్ద ఉన్న బ్రిడ్జి కొట్టుకుపోయింది. అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

- గంభీరావుపేట, ఆంధ్రజ్యోతి



అంజన్న ఆలయం వద్ద కొట్టుకుపోయిన బ్రిడ్జి

ఊరిస్తూ.. నిరాశపరుస్తూ..

(5వ పేజీ తరువాయి)

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగుస్తుంది. 31 దాటిన తరువాత కేంద్రం నిధులు వెనక్కి వెళతాయి.

● మహిళా రైతులకే యాంత్రీకరణ

వ్యవసాయ యాంత్రీకరణలో తొలిసారిగా మహిళారైతులకు పని ముట్లు అందించడానికి నిర్ణయించారు. 13రకాల యాంత్రీకరణ పరికరాలు ఇవ్వాలని నిర్ణయించారు. 50శాతం రాయితీతో మహిళా రైతు లకు మాత్రమే యంత్రాలు, పరికరాలు ఇవ్వాలని నిర్ణయించారు. సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లోని మండలాల్లో ప్రణాళికలు కూడా రూపొందించారు. యాంత్రీకరణలో ట్రాక్టర్ రూ.5 లక్షలు, రోటోవేటర్ రూ 1.44 లక్షలు, పవర్ టిల్లర్ రూ లక్ష, స్ట్రాబేలర్స్ రూ లక్ష, మేయిజ్ షెల్లర్ రూ లక్ష, కల్టివేటర్, ప్లవ్, కేజీవీల్, రోటేపడ్లర్ రూ 75906, పవర్ స్ప్రేయర్ రూ 45 వేలు, బ్రష్ కట్టర్ రూ 35 వేలు, పవర్ వీటర్ రూ 35వేలు, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్ రూ 30వేలు, బండ్ ఫార్మార్ రూ 13వేలు, బ్యాటరీ ఆపరేటర్ స్ప్రేయర్ రూ 5 వేలు తదితర రకాలను 50శాతంతో అందించనున్నారు. జిల్లాలో వానాకాలం, యాసంగి సీజన్‌లలో 4 లక్షల ఎకరాల్లో వివిధసంటలు సాగు చేస్తారు. వ్యవసాయ కూలీల కొరతతో ప్రతి సీజన్‌లోను రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సబ్సిడీపై యంత్రాలు ఇవ్వడం ద్వారా ఇబ్బందులు తొలగుతాయని భావిస్తున్నారు. జిల్లాకు ప్రభుత్వం 12 మండలాలు, రెండు మున్సిపాలిటీలలోని రైతులకు 198యూనిట్లు, రూ 58.84లక్షలను మంజూరుచేసింది. ప్రస్తుతం మార్కెట్‌లో వ్యవసాయ పరికరాల కొనుగోలు చేయాలంటే పెద్దమొత్తంలో ఖర్చు అవుతుంది. కల్టివేటర్ బయట తయారుచేస్తే రూ.30 నుంచి రూ 50వేలు, రోటవేటర్ కొనాలంటే రూ లక్ష వరకు ఖర్చు అవుతుంది. పురుగుల మందు పిచికారీ యంత్రాల ధర మార్కెట్‌లో రూ 3 వేల నుంచి రూ పది వేల వరకు ఉన్నాయి. వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా సగం ధరకే పరికరాలు రానుండడంతో చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి) : సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎంపీడీవో సత్తయ్య అన్నారు. మండల వనరుల కేంద్రంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 14మంది ఉత్తమ ఉపాధ్యాయులను మంగళవారం ఆయన ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో సత్తయ్య, ఎంఈవో కృష్ణహరి, హెచ్‌ఎంలు మనోహరచారి, మధుమాలతి, కృష్ణహరి పాల్గొన్నారు.

అన్నదాతలకు తప్పని యూరియా తిప్పలు



ఎల్లారెడ్డిపేటలో బారులు తీరిన రైతులు



తంగళ్లపల్లి మండల కేంద్రంలో బారులు తీరిన రైతులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అన్నదాతలకు యూరియా తిప్పలు తప్పడం లేవు. మండల కేంద్రంలోని ఐకేపీ, గ్రోమోర్ కేంద్రాల వద్ద మంగళవారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. యూరియా పంపిణీ చేస్తారనే సమాచారంతో వేకువజాము నుంచే రైతులు కేంద్రాల వద్దకు చేరుకున్నారు. గంటల తరబడి వరుసలో నిలబడ్డారు. కొందరు ఓపిక లేక కింద కూర్చున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలోని కేంద్రానికి 20 మెట్రిక్ టన్నుల యూరియా, గ్రోమోర్ కేంద్రానికి 14 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయిందని ఏవో రాజశేఖర్ తెలిపారు. టోకెన్లు అందుకున్న రైతులు ఎరువు కోసం పడిగాపులు కాచారు. స్వల్ప తోపులాట చోటు చేసుకోవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. వరుస క్రమంలో ఉండాలని సూచించారు. ఒక్కో రైతుకు రెండు బస్తాలను అందించారు. కొందరికి యూరియా బస్తాలు లభించకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ఐకేపీ ఆధ్వర్యంలోని కేంద్రం వద్ద 10మెట్రిక్ టన్నులు, గ్రోమోర్ కేంద్రం నుంచి 14 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశామని అధికారి రాజశేఖర్ పేర్కొన్నారు.

● తంగళ్లపల్లి : మండలంలోని యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. మంగళవారం మండల కేంద్రంలో గ్రోమోర్ ఫర్టిలైజర్ షాప్ ముందు ఉదయం 7 గంటల నుంచే యూరియా కోసం రైతులు బారులు తీరారు. షాప్ తెరుచుకోక ముందే గంటల తరబడి రైతులు యూరియా కోసం నిలబడ్డారు. 9 గంటల నుంచి యూరియా అందివ్వడంతో ఒక్కసారిగా దూసుకు రావడంతో పలువురు రైతుల మధ్య వాగ్వివాదం తలెత్తింది.

కోనరావుపేట : యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. మండల కేంద్రంలోని మన గ్రోమోర్ సంస్థకు 2 బస్తాలు వచ్చేయని తెలుసుకొని రైతులు బారులు తీరారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు కూడా రైతులకు సరిపడా యూరియా దొరకకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. సిగ్నల్ లేకపోవడంవల్ల తంబ్ వేయక జాప్యం జరిగిందని రైతులు తెలుపుతున్నారు. చివరికి ఆధార్‌కార్డు చూపిస్తూ పేరు నమోదు చేసుకొని యూరియా బస్తాలు ఇచ్చారని ఆరోపిస్తున్నారు. 200 బస్తాలు వచ్చాయని తెలిసినా రైతులు 300 మంది వచ్చారు. కానీ 200 మందికి బస్తాలు దొరికాయి. మరో వందమంది వెనుదిరిగి పోయారు. అధికారులు యూరియా సమస్యను పరిష్కరించాలని రైతులకు కోరుతున్నారు.



కోనరావుపేటలో పడిగాపులు కాస్తున్న రైతులు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



ఫర్టిలైజర్ షాపును ప్రారంభిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

తంగళ్లపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):ఇందిర మహిళా శక్తి పథకంలో ఎరువులు, ఫర్టిలైజర్ దుకాణాలు ఏర్పాటుచేసుకున్న మహిళలు పకడ్బందీగా వ్యాపారం చేసుకొని ఆర్థికంగా వృద్ధి చెందాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆకాంక్షించారు. మంగళవారం ఇందిర మహిళా శక్తి కింద మండల కేంద్రంలో తేజశ్రీ గ్రామ సమైఖ్య మహిళా సంఘం ఏర్పాటు చేసిన ఎరువులు, విత్తనాల దుకాణాన్ని కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇందిరా మహిళా శక్తి కింద ఇప్పటికే క్యాంటీన్లు, డెయిరీయూనిట్, కోడి పిల్లల పెంపకం, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంక్, ఇతర స్వయం ఉపాధి యూనిట్లను అందజేస్తున్నామన్నారు. త్వరలో మహిళా సంఘాల సభ్యులకు రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. జిల్లాలో మొత్తం 23 దుకాణాలు మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నామని దీంట్లో భాగంగా ఇప్పటికే పలు దుకాణాలు ప్రారంభించామని అన్నారు. ఎరువులు, పురుగు మందుల దుకాణాలు ఏర్పాటు రాష్ట్రంలోనే ప్రథమమని వెల్లడించారు. మహిళ సంఘాల సభ్యులు ప్రణాళిక ప్రకారం నిర్వహించి రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు తమ పరిధిలోని మహిళ సంఘాల అధ్వర్యంలో కొనసాగుతున్న ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో కొనుగోలు చేసి మహిళలకు ఆర్థికంగా మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో శేషాద్రి, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి : కలెక్టర్



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లో వివిధ శాఖల ద్వారా చేపట్టిన పలు అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత శాఖా అధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్ష నిర్వహించారు. డీఆర్డీఏ, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నూతన గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్, సెగ్రిగేషన్ షెడ్, అంగన్‌వాడీ కేంద్రాలలో మౌళిక వసతుల కల్పన తదితర అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ జిల్లాలో 26 గ్రామ పంచాయతీ భవనాలు నిర్మాణం ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని అన్నారు. ముందుగా రెండు వేల కంటే ఎక్కువ జనభా ఉన్న ఆవాసాలనకు మొదటి ప్రాధాన్యతగా, 1500 జనాభా ఉన్న ఆవాసాలకు తదుపరి ప్రాధాన్యతగా జీపి భవనా నిర్మాణం పనులు చేపట్టాలని అన్నారు. సిరిసిల్ల వేములవాడలో రూ. 1.28 కోట్ల వ్యయంలో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డిఆర్డీఏ శేషాద్రి, డిడబ్ల్యువో లక్ష్మీరాజ్యం, పిఆర్ ఈఈ సుదర్శన్‌రెడ్డి, డిపివో షరీఫుద్దీన్, ఆర్‌అండ్‌బి అధికారులు తదితరలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచి సకాలంలో పూర్తిచేసే విధంగా మండల ప్రత్యేక అధికారులు నిత్యం పర్యటించి పర్యవేక్షించాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. జిల్లాలో మండలాల వారిగా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లు, మార్కింగ్ చేసిన ఇళ్లు, నిర్మాణాలు జరుగుతున్న ఇళ్ల వాటి పురోగతి వివరాలను మండలాల వారీగా కలెక్టర్ అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వం 10వేల 234 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా 5301 ఇళ్ల మార్కింగ్ చేయడం జరిగిందని, 3230 ఇళ్ల బేస్మెంట్ స్థాయికి, 192 ఇళ్ల గోడల వరకు, 643 ఇళ్లురూఫ్ వరకు ఒక ఇళ్లు నిర్మాణం పూర్తిగా జరిగిందన్నారు. మిగిలిన 847 ఇళ్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా చేయాలని ఇళ్ల నిర్మాణానికి ఎవరైనా లబ్ధిదారులు ముందుకు రాకపోతే వాటిని రద్దు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉచిత ఇసుకను అందిస్తుందని ఇసుక తీసుకెళ్లేందుకు కూలీ ,రవాణా చార్జీలు మాత్రమే లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుందని జిల్లాలో ఎక్కడైనా రూ 15 వందల కంటే ఎక్కువ ట్రాక్టర్‌ఇసుక సరఫరా కోసం వసూలు చేస్తే అధికారుల దృష్టికి లబ్ధిదారులు తీసుకరావాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో హౌసింగ్ పీడి శంకర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ సంతకం లేకుండా మంజూరు పత్రాలు జారీ

- బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేష్

వేములవాడ టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మధ్యమానేరు జలాశయంలో ముంపునకు గురైన నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్ల పేరుతో మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నారని, వాటిపైనా కలెక్టర్ సంతకాలు లేవని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేష్ అన్నారు. వేములవాడ మండలంలోని అనుపురంలో నిర్వాసితులకు ఇస్తున్న ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పరిశీలించారు. మంజూరు పత్రాలపైన కలెక్టర్ సంతకం లేకుండా పత్రాలను పంపిణీ చేయడంతో నిర్వాసితులు అయోమయానికి గురువుతున్నారని అన్నారు. సంబంధిత అధికారులు సంతకం చేసిన పత్రాలను నిర్వసితులకు అందజేయాలని, నిర్వసితుల్లో ఉన్న ఆందోళనను తీసివేయాలని కోరారు. వెంట బీజేపి నాయకులు శంకర్, ఏరెడ్డి రాజిరెడ్డి గ్రామస్థులు, నిర్వసితులు ఉన్నారు.

అధికారంలో ఉన్నా లేకున్నా వెన్నంటి ఉంటా..

- నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అధికారంలో ఉన్నా లేకున్నా రైతన్నల వెన్నంటి ఉంటానని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. గంభీరావుపేటలో మంగళవారం కొండూరు రవీందర్‌రావుకు కృతజ్ఞత సన్మాన కార్యక్రమాన్ని రైతులు ఏర్పాటు చేశారు. రవీందర్‌రావు నమాజ్ చెరువులోకి వచ్చే బోదర్ కాలువ శుభ్రం చేయించడమే కాకుండా గులాం చెరువు తూం వద్ద ఏర్పడ్డ బుంగకు మరమ్మతులు చేయించారు. దీంతో స్థానిక సింగిల్‌విండో వద్ద రవీందర్‌రావును కృతజ్ఞతగా రైతులు సన్మానించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ పరంగా ఇబ్బందులు తలెత్తినప్పుడు ఈ ప్రాంత వాసిగా తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా రైతులకు సహకరించేందుకు ఎప్పుడూ ముందు వరుసలో ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, సింగిల్ విండో వైస్‌చైర్మన్ రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు వెంకటి, ప్రధాన కార్యదర్శి గంద్యాడపు రాజు, నాయకులు, రైతులు లింగమ్‌యాదవ్, వహీద్, ఎగదండి స్వామి, రెడ్డిమల్ల రాజనర్సుబండ రమేస్, నర్సింగరావు, దేవేందర్, వెంకటి, నారాయణ, హరీష్, తిరుపతి, రాజేందర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా కాళోజీ నారాయణ జయంతి వేడుకలు



సిరిసిల్ల బీఆర్‌ఎస్ భవన్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న మానేరు రచయితల సంఘం సభ్యులు



లింగన్నపేటలో బాల కవులకు సన్మానం..

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాహితీవేత్త కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ భవన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, జిల్లా గ్రంథాలయం మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, మాజీ జడ్పీటీసీ కోడా ఆంతయ్య, మాజీ ఎంపీపీలు గజభీంకార్ రాజన్న, చంద్రయ్యగౌడ్, మాజీ కౌన్సిలర్లు దార్ల సందీప్, రిక్కుమల్ల సంపత్‌కుమార్, నాయకులు గడ్డం భాస్కర్, సుంకపాన మనోజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కాళోజీ నారాయణను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని మానేరు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు టీవీ నారాయణ, అధ్యక్షుడు గెంట్యాల భూమేష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో కాళోజీ నారాయణ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మానేరు రచయితల సంఘం సభ్యులు పూలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మానేరు రచయితల సభ్యులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి : ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి వేడుకలు ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో మంగళవారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రాలతో పాటు వెంకటాపూర్, సింగారం, రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, అల్మాస్‌పూర్, రాజన్నపేట, బాకురుపల్లి తండా, బండలింగంపల్లి, నారాయణపూర్, రంగంపేట, గర్జనపల్లి, కంచర్ల, అడవిపదిర, వన్‌పల్లి తదితర గ్రామాల్లోని గ్రామపంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ ప్రైవేటు విద్యాలయాల్లో నివాళులు అర్పించారు. తహసీల్దార్లు సుజాత, ముక్తర్‌పాషా, ఎంపీడీవోలు సత్తయ్య, బీరయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యలయం అవరణలో ప్రజాకవి కాళోజి నాయణరావు జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలో ఒబులాపూర్ ప్రభుత్వ పాఠశాలతో పాటు మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో కాళోజి జయంతి వేడులను జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో లక్ష్మీనారయణ, ఎంఈవో బుక్యా రాజు, హెచ్ ఎం బండి ఉపేందర్, ఏపీఎం నాగరాజు, జెఈ రాజనర్సు, సూపరిడేంట్ రమేశ్, సద్దాం, రవి తదితరలు పాల్గొన్నారు.

● వేములవాడ కల్చరల్ : వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా కవి కాళోజీ జయంతి, తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అధ్యాపకులు డాక్టర్ శారద, డాక్టర్ శోభారాణి, ప్రసాద్, శ్రీధర్‌రావు, శకుంతల, కృష్ణప్రసాద్, నర్సయ్య, కరుణ తదితరులు ఉన్నారు.

● చందుర్తి : చందుర్తి మండలం జోగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాళోజి నారాయణరావు జయంతి ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ రాజు, ఉపాధ్యాయులు కాళోజి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మెడికాల అంజయ్య, మహేష్, జావీద్, గోవర్ధన్, శ్రీనివాస్, పద్మ, నర్సయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో తెలంగాణ మాండలిక భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అధ్యాపకులు పాల్గొన్నారు. కాలోజీ నారాయణరావు జయంతిని లింగన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. 35మంది బాలకవులను సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, గాలిపెల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవరాజం, అధ్యాపకులు నయిమొద్దీన్, శ్రీనివాస్, లక్ష్మన్, మమత, రాజశేఖర్, రమేష్ పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : మండలంలోని కొండాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాళోజీ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన రాసిన కవితలను వినిపించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి వివేక్‌కు సన్మానం..

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిరిసిల్ల దళిత సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. తెలంగాణ ఏర్పడ్డాక దళిత సామాజిక వర్గం నుంచి మంత్రిగా బాధ్యతలను స్వీకరించిన గడ్డం వివేక్‌వెంకటస్వామిని సన్మానించుకోవాలని దళిత సంఘాలు భావించాయన్నారు. బుధవారం జిల్లా కేంద్రం లహరి ఫంక్షన్ హాల్‌లో మంత్రికి సన్మానం ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పాల్గొనాన్నారు. మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు, మాజీ కౌన్సిలర్ సిరిగిరి రమేష్, గొట్టి లింబాద్రి, రాకేష్ పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకులు శుభ్రం

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు అక్కపల్లి గ్రామంలో తాగునీటి ట్యాంకుల చుట్టూ నాచు పేరుకుపోయి అపరిశుభ్రంగా మారాయి. ఈనెల 8న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'తాగునీటి ట్యాంకులపై పట్టింపేదీ..?' కథనానికి మంగళవారం పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, పవిత్రలు స్పందించారు. ట్యాంకులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పంచాయతీ కార్మికులతో శుభ్రం చేయించారు. తాగు నీటి ట్యాంకులు శుభ్రం చేయడం పట్ల కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

డాక్టరేట్ పొందిన యువకుడికి సన్మానం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉస్మానియా విశ్వవిద్యాలయంలో గణిత విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేటు పట్టా పొందిన మండల కేంద్రానికి చెందిన యువకుడు ఎనగందుల శ్రీనివాస్‌ను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావులు మంగళవారం వేర్వేరుగా సన్మానించారు. నర్సింహారెడ్డి, నర్సింలు, మురళీమోహన్‌గౌడ్, సందీప్, వెంకటనర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, సురేశ్, ఉమేశ్, హసన్, బాల్‌రెడ్డి, రాజం పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం, నగదు వితరణ

ఎల్లారెడ్డిపేట,సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన గ్రామపంచాయతీ కార్మికుడు మారుపాల బాలఎల్లయ్య కుటుంబానికి స్థానిక బీజేపీ నాయకులు మంగళవారం 50 కిలోల బియ్యం, రూ.వేయి నగదును వితరణ చేశారు. సత్యంరెడ్డి, భాస్కర్, సత్యం, రాకేశ్, వినయ్, రాజు, కిష్టయ్య, హన్మంత్, రవి, రంజిత్‌కుమార్, శేఖర్, శ్రీనివాస్, నారాయణ, శివయ్య, దేవయ్య, శ్రీకాంత్, సునీల్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగి ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలని మానసిక నిపుణుడు ప్రవీణ్ అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే జూనియర్, డిగ్రీ కళాశాల(పురుషుల) కళాశాల విద్యార్థులకు 'మానసిక ఒత్తిడి-ఆత్మహత్యల నివారణపై మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనుల తనిఖీ..

తంగళ్లపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాళ్లపేట, మండేపల్లి గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పనులను ఎంపీడీవో లక్ష్మీనారాయణ మంగళవారం తనిఖీ చేశారు. రాళ్లపేటలో ప్లానిటేషన్‌తో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అలాగే ప్రాథమిక పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం మండేపల్లిలో మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు తదితర ఈజీఎస్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో నాగరాజు, జెఈ రాజనర్సులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రుద్రంగి, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో పరిష్కరిస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి అన్నారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుద్రంగి బస్టాండ్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా గుంతలు ఏర్పడి ఆర్టీసీ బస్సులు బస్టాండ్ లోపలికి రావడానికి ఇబ్బందులు పడుతున్నారాని తమ దృష్టి గ్రామస్థులు తీసుకురావడంతో వెంటనే మట్టి పోయించి చదును చేయించామన్నారు. కార్యక్రమంలో గండి నారాయణ, తర్రె లింగం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చందుర్తి తహసీల్దార్‌గా భూపతి

చందుర్తి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో వీటీడీఏ ఎస్టేట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న లగిశెట్టి భూపతి బదిలీపై వచ్చి చందుర్తి తహసీల్దారుగా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. రెండు సంవత్సరాలుగా తహసీల్దార్‌గా పనిచేసిన శ్రీనివాస్ వీటీడీఏ ఎస్టేట్ ఆఫీసర్‌గా బదిలీపై వెళ్లారు.

గాలిపల్లిలో వైద్యశిబిరం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాలిపల్లిలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. పల్లె దవాఖాన వైద్యాధికారి కట్ట రమేష్ ఆధ్వర్యంలో 76మందికి పరీక్షలు నిర్వహించారు. ఐదుగురికి జ్వరలక్షణాలు ఉండటంతో మందులను పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది కవిత, భారతి, లక్ష్మి, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కాళోజీ నారాయణరావు జయంతి నిర్వహించారు. పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయుడు రుద్ర రమేష్ కాళోజీ చిత్రపటాన్ని చిత్రీకరించి ప్రధానోపాధ్యాయురాలు శారదకు అందించారు. చిత్రపటానికి పూలతో నివాళులర్పించి, ఉపాధ్యాయుడు రమేష్‌ను సన్మానించారు. అనంతరం విద్యార్థులకు పద్య పఠన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు.

కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం

చందుర్తి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్‌లో చందుర్తి ఎస్సై రమేష్ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంను మంగళవారం రాత్రి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సామాజిక సమస్యలను చొరవ తీసుకుని పరిష్కరించుకోవాలన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బోయినపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది మద్యానికి బానిసైన ఓ మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన బోయినపల్లి మండలం విలాసాగర్‌లో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన బత్తిని సమ్మవ్వ(45) భర్త ఐదు సంవత్సరాల క్రితం మృతిచెందాడు. సమ్మవ్వ కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగించేది. సమ్మవ్వ అల్లుడు ప్రభాకర్ పది రోజుల క్రితం అనారోగ్యం బారినపడి మృతిచెందాడు. భర్త మరణంతో మద్యానికి బానిసైన సమ్మవ్వ అల్లుడు కూడా మృతిచెందడంతో సోమవారం భర్త సమాధి వద్ద పురుగుల మందు తాగింది. స్థానికులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



పోటీల్లో ప్రతిభ కరబర్చిన విద్యార్థులు

గంభీరావుపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో సైమా ఆకాడమీ క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబర్చి, చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు. కరీంనగర్‌లో ఇంటర్‌నేషనల్ షావోలిన్ కుంగ్‌ఫూ బ్రూస్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, మోడల్ స్కూల్, ఆక్స్‌ఫర్డ్, దమ్మన్నపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు సైమా అకాడమీలో శిక్షణ తీసుకుని పోటీల్లో పాల్గొన్నారు. మొత్తం 28 మంది పాల్గొనగా, అందులో 25 మంది పతకాలు సాధించారు. 25 బంగారు పతకాలు, 3వెండి పతకాలు సాధించి, చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. వీరిని ఆకాడమీ కోచ్ విక్రమ్, సైమా అకాడమీ ఫౌండర్ విద్యాసాగర్, జిల్లా కోచ్‌లు శ్రీనివాస్, సంజన, అక్షిత, పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, యోగా కోచ్ దేవయ్య, అథ్లెటిక్ కోచ్ జంపన్న, జిల్లా ఉష్ సెక్రటరీ విక్రమ్ అభినందించారు.